క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



కనకవీడులో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

నందవరం: మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో ఆదోని మధు హాస్పిటల్ నేతృత్వంలో గ్రామస్తులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం గ్రామంలో డాక్టర్లు కె.అరుణ, దేవనగౌడ ఆధ్వర్యంలో వృద్ధులకు బీపీ, షుగర్, గ్యాస్ట్రిక్, నరాలు, మోకాళ్ల నొప్పులు, గుండెకు సంబంధించిన పరీక్షలు చేపట్టారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరాముడు, లక్ష్మీకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూలిన మిద్దె

మద్దికెర: మండల కేంద్రంలోని బెస్తవీధిలో ఆదివారం ఉదయం ఉన్నట్టుండి మిద్దె కూలింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఆ ఇంట్లో కుమారుడు, కూతురితో పాటు తిప్పమ్మ అనే వ్యక్తి నివాసం ఉండేవారని ఉదయం ఉరవకొండ సమీపంలోని పల్లెలో గృహ ప్రవేశం ఉండడంతో వెళ్లారని స్థానికులు తెలిపారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మిద్దె కూలడంతో ప్రమాదం తప్పినట్లయ్యింది.

కొబ్బరి బోండాల లారీ బోల్తా



వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి పట్టణ సమీపంలోని డోన్ రైల్వే గేటు అవతల హైవే –44 యు జంక్షన్‌లో కొబ్బరి బోండాల లోడ్‌తో వెళ్తున్న హర్యానాకు చెందిన లారీ బోల్తా పడింది. మధురై నుంచి కొబ్బరి బోండాల లోడ్‌ను ఢిల్లీకి తీసుకెళ్తూ డోన్ దాటుకుని వచ్చి ఆదివారం తెల్లవారుజామున అదుపుతప్పి బోల్తా పడింది. లారీ ఉన్న డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడగా కొబ్బరిబోండాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. రూ.లక్షల్లో ఆస్తి నష్టం సంభవించింది. హైవే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ప్రమాదానికి గురైన లారీని పక్కకు తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

చెత్తకుప్పలో ఓటరు కార్డులు



బొందిమడుగులలో చెత్తకుప్పలో పడేసిన ఓటరు కార్డులు

తుగ్గలి: మండల పరిధిలోని బొంది మడుగులలో ఓటరు కార్డులను చెత్త కుప్పలో పడేశారు. గతంలో వచ్చిన పాత ఓటరు కార్డులను సిబ్బంది పంపిణీ చేయకుండా నిర్లక్ష్యం చేశారు. ఈ క్రమంలో ఆదివారం ఓటరు కార్డులు చెత్తకుప్పలో పడిఉండడాన్ని గమనించిన స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. స్థానిక అధికారులు ఓటరు కార్డులను సేకరించి ఆర్డీఓ ఆఫీసులో అప్పగించారు. ఘటనపై ఆర్డీఓ రామలక్ష్మి విచారణ చేపట్టారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు.

మిలటరీ బలగాల కవాతు



నంచర్లలో కవాతు నిర్వహిస్తున్న బలగాలు

చిప్పగిరి: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఆదివారం మండలంలోని నంచర్ల, దౌల్తాపురం గ్రామాలలో ఎస్‌ఐ మహమ్మద్ రిజ్వాన్ ఆధ్వర్యంలో పారా మిలటరీ బలగాల కవాతు నిర్వహించారు. గ్రామాలలోని ప్రధాన వీధులలో కవాతు చేపట్టారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించాలని సూచించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

దేవనకొండ: మండల కేంద్రంలోని సీఎల్ ఆర్‌సీ భవన్ వెనక ఓ వ్యక్తి అనారోగ్యంతో మరణించాడు. ఆ వ్యక్తికి సంబంధించి ఎలాంటి వివరాలు తెలియకపోవడంతో ఆదివారం దేవనకొండ పంచాయతీ సిబ్బంది పంచనామా చేసి అంత్యక్రియలు నిర్వహించారు.

27న అవగాహన సదస్సు

ఆలూరు: ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాధాన్యతపై ఈనెల 27న స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.రామునాయక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి జిల్లా ఎన్నికల మెజిస్ట్రేట్, కలెక్టర్ డాక్టర్ సృజన ముఖ్య అతిథిగా హాజరవుతారని వెల్లడించారు. అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

ఎన్ని పార్టీలు కలిసొచ్చినా జగనన్నదే విజయం



కె.వెంకటాపురంలో ప్రజలకు అభివాదం చేస్తున్న విరూపాక్షి



తన ఓటు జగన్‌కే అని విరూపాక్షితో చెబుతున్న వృద్ధురాలు

ఆస్పరి: సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని సస్యశ్యామలంగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కిందని, రాబోయే ఎన్నికల్లో ఎన్ని పార్టీలు కలిసొచ్చినా జగనన్నదే విజయమని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని చిరుమాన్‌దొడ్డి, శంకరబండ గ్రామాలలో ఎంపీపీ సుంకర ఉమాదేవి, సర్పంచులు సుంకర నాగమ్మ, విజయలక్ష్మి ఆధ్వర్యంలో విరూపాక్షి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికి శాలువా, పూలమాలలతో సన్మానించారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి అవ్వాతాతలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు ఆయా గ్రామాల్లో సమస్యలను తెలుసుకుని తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగనన్న గెలుపొందాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీతో పాటు ఎన్ని తోక పార్టీలు కూటమిగా ఏర్పడి కుట్రలు పన్నినా జగనన్నను తాకలేరని స్పష్టం చేశారు. గ్రామాలలో నెలకొన్న మంచి నీటి సమస్య, సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువలు సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అంతకుముందు ఆయన మండలంలోని బిణిగేరి, చిరుమాన్‌దొడ్డి గ్రామాలలో జరిగిన వివాహ వేడుకలలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. అడ్వకేట్ హరిసర్వోత్తమ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మూలింటి రాఘవేంద్ర, కట్టెల గోవర్ధన, పెద్దయ్య, సుంకర రామాంజనేయులు, పురుషోత్తమ రెడ్డి, దత్తాత్రేయ రెడ్డి, కేశవ రెడ్డి, లక్ష్మీనారాయణ, నల్లన్న, శేఖర్, లక్ష్మీకాంతరెడ్డి, శేఖర్ రెడ్డి, లాల్‌రెడ్డి, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

దేవనకొండ: ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తానని వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి పేర్కొన్నారు. ఆయన ఆదివారం మండలంలోని కె.వెంకటాపురం గ్రామంలో పర్యటించారు. ఆయనకు పార్టీ నాయకులు, అభిమానులు పూల వర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. విరూపాక్షి మాట్లాడుతూ గతంలో పాలకులు దోచుకోవడానికి మాత్రమే పరిపాలించారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరిస్తోందన్నారు. ఆలూరు నియోజకవర్గంలో మూడో సారి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగుర వేయాలని పిలుపునిచ్చారు. గత నాయకులు కన్నతల్లి లాంటి పార్టీని వదిలి వెళ్లిపోయారని, వారి పేకాట స్థావరాలు, నాటుసారా వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవడానికి మాత్రమే పార్టీలు మారుతారని విమర్శించారు. అలాంటి వారికి ప్రజలు ఓటుతో బుద్ధి చెబుతారన్నారు. మండల కన్వీనర్ తపాల శ్రీనివాసులు, వైఎస్సార్సీపీ నాయకులు రాజశేఖర్, హర్షవర్దన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం బస్సు యాత్రను జయప్రదం చేద్దాం

ఆలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న సిద్ధం సభలకు ఆలూరు నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లి విజయవంతం చేయాలని పార్టీ ఆలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం దేవనకొండ మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. సీఎం సభ విజయవంతం చేయడంపై చర్చించారు. నాయకులు అలారుదిన్నె ప్రభాకర్ రెడ్డి, తువ్వదొడ్డి మోహన్‌రెడ్డి, కప్పట్రాళ్ల దివాకర్‌నాయుడు, ప్రేమనాథ్ రెడ్డి, సర్పంచ్‌లు సంఘం మండలాధ్యక్షుడు అరుణకుమార్, జిల్లా వైఎస్సార్‌సీపీ కోశాధికారి కొత్తకాపుమధుసూదన్‌రెడ్డి తదితరులు విరుపాక్షికి కొన్ని సూచనలు చేశారు. విరూపాక్షి మాట్లాడుతూ.. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు అందరం ఐకమత్యంగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ప్రజామద్దతు వైఎస్సార్‌సీపీకే ఉందని, టీడీపీ నాయకులు ఎన్ని కుట్రలు చేసినా అధికారంలోకి రాలేరన్నారు. వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



భాస్కరరెడ్డికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి: మండల పరిధిలోని పెండేకల్లుకు చెందిన టీడీపీ నాయకుడు, కోట్ల అనుచరుడు కారం భాస్కరరెడ్డి ఆదివారం కర్నూలులో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేస్తానని భాస్కరరెడ్డి చెప్పారు. మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై నిఘా

ఆలూరు రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఆలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు చెప్పారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని 294 పోలింగ్ కేంద్రాల్లో 36 అత్యంత సమస్యాత్మక, 40 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. నేర ప్రవృత్తి గల వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పోలింగ్ రోజు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కర్ణాటక సరిహద్దులోని హొళగుంద మండలం మార్లమడికి, హాలహర్వి మండలం క్షేత్రగుడి వద్ద అంతరాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఎప్పటికప్పుడు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు చేయిస్తున్నామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



బుట్టా రేణుక సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన హెచ్.కైరవాడి గ్రామ నాయకురాలు అరుణమ్మ తదితరులు

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని 29వ వార్డుకు చెందిన టీడీపీ మాజీ మహిళాధ్యక్షురాలు గాజుల గోకారమ్మతో పాటు లక్ష్మి, చంద్రిక, దుర్గ, పద్మావతి, ఆవుల పద్మావతి, పాండు, శివకుమార్, వెంకటేష్, ప్రసాద్, విశ్వనాథ్, చిన్ను, ఉదయ్, గోవింద్ రాజులు, రమేష్, నారాయణ, కర్రెప్పతో పాటు మరో 100 మంది ఆదివారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. పట్టణ అధ్యక్షుడు–2 నజీర్ అహమ్మద్, వార్డు ఇన్‌చార్జ్ ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి ఆమె పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

హెచ్.కైరవాడి గ్రామ నాయకురాలు చేరిక

గోనెగండ్ల మండలంలోని హెచ్. కైరవాడి గ్రామానికి చెందిన గ్రామ నాయకురాలు ఆర్.అరుణమ్మ, గౌతమ్ రెడ్డితో పాటు వడ్డె గోపాల్, కురువ సుంకన్న, మంగళ ఉరుకుందు, చాకలి శివ రాముడు, బోయ రాముడు, ఉప్పరి లక్ష్మన్న, బాలు, హరున్, బాష, రహంతుల్లా, వడ్డే హనుమన్న, శివ మరో 200 మంది ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ బుట్టా రేణుక పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ గెలుపుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. బుట్టా శివ నీలకంఠ, ప్రతుల్ తదితరులు పాల్గొన్నారు.



కదమకుంట్లలో ఒకేచోట నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్, రాతనలో పక్కపక్కనే నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్‌సెంటర్

సేవలన్నీ ఒకే చోట

తుగ్గలి: ఈ ఫోటోల్లో కనిపిస్తున్నది ఒకే చోట నెలవైన ప్రభుత్వ కార్యాలయాలు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రజలకు సులువుగా సేవలందించేందుకు మండల పరిధిలోని కదమకుంట్ల, రాతనలో పక్కపక్కనే ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించారు. ఒకేచోట గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేసి సేవలందిస్తుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

● సంక్షేమ ప్రభుతాన్ని ఆశీర్వదించండి

నందవరం: పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక విన్నవించారు. ఆదివారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో సర్పంచ్ లక్ష్మీ కుమారుడు రవికుమార్ వివాహానికి ఆమెతో పాటు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు జగన్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. వారికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బుట్టా రేణుక మాట్లాడుతూ.. పేద బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి చెందాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని గెలుపించుకోవాలని పిలుపునిచ్చారు. సీఎం జగనన్న నవరత్నాలతో పేదల బతుకుల్లో వెలుగులు నింపారన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బుట్టా శివనీలకంఠప్ప, బుట్టా ప్రతుల్, మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ్, ముగతి సర్పంచ్ విరుపాక్షి రెడ్డి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



నాగలదిన్నెలో ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుకకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

నాణ్యతలో రాజీ పడొద్దు



మార్లమడికి రోడ్డు పనులను పరిశీలిస్తున్న పీఆర్ చీఫ్ ఇంజినీర్ అమర్నాథ్ రెడ్డి

హొళగుంద: రోడ్ల నిర్మాణాల్లో నాణ్యతలో రాజీ పడకుండా పనులు చేపట్టాలని విజయవాడ నుంచి వచ్చిన పంచాయత్‌రాజ్ చీఫ్ ఇంజినీర్ అమర్నాథ్ రెడ్డి కిందిస్థాయి అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కర్ణాటక సరిహద్దులో జరుగుతున్న హొళగుంద – మార్లమడికి 5.10 కి.మీ డబుల్ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ఆదివారం ఎస్ఈ సుబ్రమణ్యంతో కలిసి పరిశీలించారు. పనులు ఎంత వరకు వచ్చాయి. పనుల్లో నాణ్యత పాటిస్తున్నారా తదితర వాటిని పరిశీలించారు. ఇప్పటికే రోడ్డుపై గ్రావెల్ వేసి గట్టిపరిచిన కాంట్రాక్టర్ కొద్ది రోజులుగా కంకర పనులను చురుగ్గా చేపడుతున్నారు. రూ.5.34 కోట్లతో జరుగుతున్న ఈ పనుల్లో భాగంగా స్థానిక వాల్మీకి సర్కిల్ నుంచి 400 మీటర్లు డబుల్ సీసీ రోడ్డు, అక్కడి నుంచి మార్లమడికి వరకు తారు రోడ్డు వేయనున్నారు. పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామని త్వరలోనే పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ రఘునాథ్ రెడ్డి సీఈకి వివరించారు. రోడ్డు పనులు చురుగ్గా నాణ్యతగా సాగుతుండడం పట్ల సీఈ సంతృప్తి వ్యక్తం చేశారు. పీఆర్ (పీఐయూ) డీఈఈ భాస్కర్, ఏఈ చంద్రశేఖర్, కాంట్రాక్టర్ రఘురాథరెడ్డి ఉన్నారు. ఇదిలాఉండగా మార్లమడికి రోడ్డు బాగైతే రెండు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు మెరుగుపడడమే గాక రవాణా సౌకర్యం సులభతరం కానుంది.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

హొళగుంద: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గ్రామాల్లో ఓటర్లను ప్రలోభ పెట్టడం, బెదరింపులకు పాల్పడడం ఇతర అసాంఘిక కార్యకలాపాలకు, అల్లర్లకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు హెచ్చరించారు. ఆయన ఆదివారం పెద్దహ్యాట తదితర గ్రామాలలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. రౌడీషీటర్లు, నేర చరిత్ర కలిగిన వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందని గ్రామాలలో ఏమి జరిగినా ఎప్పటికప్పుడు సమాచారం వస్తుందన్నారు. ఎన్నికల ప్రకటన నాటి నుంచి ఎన్నికలు ముగిసే వరకు పలు నిబంధనలు అమల్లోకి వస్తాయని వాటిని అతిక్రమించకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని కోరారు. ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు.

క్రికెట్ టోర్నీ విజేత ఆలూరు

చిప్పగిరి: మండలంలోని కుందనగుర్తిలో నిర్వహించిన మండలస్థాయి సమ్మర్ క్రికెట్ పోటీలలో ఆలూరు ఎస్పీ లెవెన్ జట్టు విజయం సాధించగా చిప్పగిరి నాకౌట్ లెవెన్ జట్టు రన్నర్‌గా నిలిచింది. విజేత జట్టుకు రూ.20 వేలు ప్రైజ్ మనీ కేథార్నాథ్ రెడ్డి, దివాకర్ రెడ్డి అందించగా రన్నర్ జట్టుకు మాజీ సర్పంచ్ సురేష్ రెడ్డి రూ.10 వేలు ప్రైజ్ మనీ అందించారు.

ఘనంగా ఇమాంసాహెబ్ వలి ఉరుసు



స్వామి వారి షంషేర్ ఊరేగింపు

మద్దికెర: మండలకేంద్రం శివారులో రైల్వే గేట్ వద్ద కొలువైన ఇమాంసాహెబ్ వలి ఉరుసు మహోత్సవాలలో భాగంగా ఆదివారం షంషేర్‌ను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా పూలతో అలంకరించిన స్వామి వారి షంషేర్‌ను గుర్రంపై కొలువుంచి మేళతాళాలు, డప్పు వాయిద్యాల మధ్య గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలు, పెద్దలు, పిల్లలు చక్కెర చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే స్వామి వారికి కానుకలను సమర్పించారు. గ్రామస్తులే గాక చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

కృష్ణగిరి: ప్రజలందరూ వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ప్రదీప్ సూచించారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో గత 10 రోజులుగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని మధ్యాహ్న సమయానికి ప్రజలు పనులు ముగించుకుని ఇంటికి చేరుకోవాలన్నారు. వడదెబ్బ అత్యంత ప్రమాదకరమని, వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే దగ్గరలోని ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స చేయించాలన్నారు. ఎండకాలంలో ఎక్కువగా పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు తాగాలని, కూల్‌డ్రింక్స్‌లు తగ్గించుకోవాలన్నారు. ముఖ్యంగా పిల్లలు ఎండలో తిరగకుండా తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలన్నారు. వడదెబ్బకు గురైన వారికి తక్షణ ఉపశమనం కలిగించేలా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అంగన్‌వాడీ కేంద్రాల్లో సిద్ధంగా ఉంచామన్నారు. వడదెబ్బ వల్ల కలిగే నష్టాల గురించి అన్ని శాఖల అధికారులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

నాడు బురదకుంట.. నేడు సీసీ రోడ్డు






నాడు- గజ్జహళ్లిలో బురద కుంటను తలపిస్తున్న తేరు వీధి, నేడు - సీసీ రోడ్డు నిర్మించిన తర్వాత ఇలా..

హొళగుంద: మండల పరిధిలోని గజ్జహళ్లి గ్రామంలోని తేరువీధి దశాబ్దాల కాలంగా బురదకుంటను తలపించేది. ఆ రోడ్డును బాగు చేయాలన్న గ్రామస్తుల మొరను గత టీడీపీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. ఈ సమస్యపై గ్రామస్తులు పలు మార్లు ఆందోళనకు దిగిన సందర్భాలు ఉన్నాయి. కనీసం అడుగు తీసి అడుగు వేయాలంటేనే భయమేసే ఆ రోడ్డులో బైక్‌లు అదుపుతప్పి కింద పడిపోవడం సర్వసాధారణమే. ఏటా పోతులింగేశ్వర స్వామి రథోత్సవానికి కూడా ఇబ్బందిగా ఉండేది. ఆ ప్రాంతంలో పారిశుద్ధ్యం పడకేసి రోగాలు ప్రబలేవి. డెంగీ లాంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలిన సందర్భాలు ఉన్నాయి. అయినా గ్రామస్తుల గోడును ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సచివాలయానికి మంజూరైన రూ.20 లక్షల నిధులతో తేరు వీధిలో సీసీ రోడ్డు నిర్మించారు. ఎన్నో ఏళ్లుగా వర్షాకాలంలో నరకం అనుభవిస్తున్న తమకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు

కృష్ణగిరి: మండల పరిధిలోని టి.గోకులపాడు ఫీడర్ కింద సోమవారం విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు చేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ మద్దిలేటి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయానికి సంబంధించి ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిరంతర సరఫరా ఇస్తున్నామని ఈ విషయాన్ని రైతులు గమనించాలని ఆయన కోరారు. అలాగే 2 గంటల నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు ఈ ఫీడర్ కింద విద్యుత్ సరఫరా నిలిపివేసి రోడ్ క్రాసింగ్ పోల్స్ మార్చడం జరుగుతుందన్నారు.

టీబీ డ్యాంలో 5.402 టీఎంసీల నీరు



టీబీ డ్యాంలో నిల్వ ఉన్న నీరు

హొళగుంద: ఉమ్మడి రిజర్వాయర్ కర్ణాటకలోని తుంగభద్ర జలాశయంలో ఆదివారం ఉదయం 5.402 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సాగు, తాగునీరును అందిస్తున్న టీబీ డ్యాంలో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా నీటి నిల్వ వేగంగా పడిపోయింది. దీంతో ఎల్లెల్సీ కింద ఒక కారు (ఖరీఫ్) పంటకు మాత్రమే సాగు నీరు అందించిన టీబీ బోర్డు అధికారులు రబీకి సాగు నీరివ్వకుండా కేవలం తాగునీటి అవసరాల నిమిత్తం గత నెల 19వ తేదీ నుంచి ఎల్లెల్సీకి 480 క్యూసెక్కుల ప్రకారంగా నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాంలో ఆదివారం ఉదయం నాటికి 1633 అడుగులకు గాను 1581.79 అడుగుల వద్ద నీరు నిల్వ ఉన్నాయి. ఇన్‌ఫ్లో జీరో ఉండగా అవుట్‌ఫ్లో రూపంలో ఎల్లెల్సీకి 844 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇక ఎల్లెల్సీ ఆంధ్ర పరిధి 250 కి.మీ వద్ద 480 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: దసరా బన్ని ఉత్సవాలకు ప్రసిద్ధి చెందిన దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి విరాట్‌మూర్తులకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి వారాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని దర్శించుకోవడానికి ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలో మూల విరాట్‌మూర్తులకు సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, అభిషేకాలు, మహామంగళారతి, నైవేద్య సమర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం జరిగింది.

భక్తిశ్రద్ధలతో మట్టల పండుగ



మట్టలతో ఊరేగింపు నిర్వహిస్తున్న క్రైస్తవులు

మద్దికెర: మండల కేంద్రంలో క్రైస్తవులు ఆదివారం మట్టల కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గుడ్ ఫ్రైడే కంటే ముందు నిర్వహించే మట్టల ఆదివారం సందర్భంగా ఈత మట్టలు పట్టుకొని గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. మట్టలు జయం, సంతోషానికి సూచనలన్నారు. అనంతరం ఆర్‌సీ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలతో పాటు ఇతర కార్యక్రమాలు నిర్వహించారు.

ఆలూరు: మండలంలోని ఎం.కొట్టాల గ్రామంలో సీఎస్ఐ చర్చి నుంచి పాస్టర్ పుష్పలకుమార్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ఈత మట్టలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పాస్టర్ బైబిల్ సూక్తులను వివరించారు. తప్పులు చేయడం మానుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.

వైభవంగా లంకోత్సవం



హనుమంతుడిపై శ్రీరంగనాథుడు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో శ్రీరంగనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం లంకోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారి ఉత్సవ మూర్తులను అందంగా అలంకరించి హనుమంతుడిపై కొలువుంచి గ్రామ పురవీధుల గుండా జనవాహిని మధ్య ఊరేగింపు చేశారు. అశేష భక్తజనం మధ్య బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. లంకోత్సవం రోజున హనుమంతుడికి స్వామివారు రాముడి రూపంలో కన్పించారని అందువల్ల బ్రహ్మోత్సవాలలో శ్రీవారిని దర్శించుకుంటే బుద్ధి, బలం, ధైర్యం పొందుతారని ప్రతీతి. కార్యక్రమంలో ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ కారుమంచి మల్లికార్జున, దాతలు పారా రామచంద్రప్రసాద్, పారా విశ్వనాథ్, పురుషోత్తం చౌదరి, సీతారామిరెడ్డి గ్రామస్తులు రామలింగారెడ్డి, ఎంపీటీసీలు కాశమ్మ, జ్యోతిలత చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.